# 20 వ శతాబ్ది తెలుగు కథకులు
## డా. కేతు విశ్వనాథ రెడ్డి గారి
## ఆకాశవాణి ప్రసంగాలు



తెలుగు కథ శత వార్షికోత్సవాల సందర్భంగా 'కౌముది' పాఠకులకి ప్రముఖ రచయిత కలం నుంచి నెలనెలా ప్రత్యేక వ్యాస పరంపర

## తెలుగు కథను తీర్చి దిద్దిన గురజాడ
## (1861–1915)



**తెలుగు కథ** అనగానే మనకు ముందుగా గురజాడ అప్పారావు జ్ఞాపకానికి వస్తారు. ఆయనే ఎందుకు రావాలి? అసలు ఆయన రాసిన కథలెన్ని? రాసినవి అయిదంకె దాటలేదే? వాటినే మనమెందుకు ముందుగా పట్టించుకోవాలి? గురజాడ కథల్లో కథాలక్షణాలు పరిపుష్టంగా ఉండడం వల్ల పట్టించుకుంటున్నాం. తన కథల్లోని కథాంగాల మధ్య ఆయన స్ఫూర్తిదాయకుడిగా ఆయనను గుర్తిస్తున్నాం. నన్నయను ఆది కవి అన్నట్లే గురజాడను తెలుగులో ఆది కథకుడని అంటున్నాం.

గురజాడకు 1895 నుంచీ కథారచన మీద చూపు ఉన్నట్లుంది. ఆయన డైరీల్లో నోటు పుస్తకాల్లో కనీసం కొన్ని పదుల కథలకు 'ముడిసరుకు' మనకు దొరుకుతుంది. ఇంగ్లండులో ప్రచురించడం కోసం ఇంగ్లీషులో కొన్ని కథలు రాయాలని కూడా ఆయన సాహిత్య ప్రణాళిక వేసుకున్నారు. 'భారతీయ జీవితాన్ని ప్రతిబింబించే అయిదువేల మాటలకు ఎక్కువ కాకుండా రాసి పంపమ'ంటూ 1904 లో ఇంగ్లాండులోని హాంప్‌స్టెడ్ నుండి మాక్స్ పెంబర్టన్ చేసిన అభ్యర్ధన ప్రకారం గురజాడ Stopping to raise అనే కథను రాశారు. ఆ కథను అవసరాల సూర్యారావు 'సంస్కర్త హృదయం' అనే పేరుతో తెనిగించారు.

గురజాడ రాసినవి అయిదు కథలు, 'దిద్దుబాటు' 1910 ఫిబ్రవరిలో ప్రచురితమైంది. 1910 మే, జూన్‌లలో 'మీ పేరేమిటి?' అచ్చయింది. మరో మూడు కథలు 'మెటిల్డా', 'సంస్కర్త హృదయం', 'పెద్ద మసీదు', పెద్ద మసీదు కథకే మరొక పేరు మతము - విమతమూ. ఈ అయిదు కథలను గురించి ఆలోచిద్దాం.

దిద్దుబాటు, మెటిల్డా, సంస్కర్త హృదయం - ఈ మూడు కథలకు స్త్రీ సమస్య కేంద్రకం. దిద్దుబాటులోని కమలిని ఇల్లాలు. విద్యావంతురాలు దారి తప్పిన భర్తను సరిదిద్దగల సంస్కారవతి. వివాహ బంధంలో అపేక్ష మీద విశ్వాసముంచిన ఒక ఆధునిక మహిళ. మెటిల్డాలోని ప్రధానపాత్ర మెటిల్డా. ఒక ముసలి పులి బారిన పడ్డ సౌందర్యవతి. సంస్కారి. వేశ్యా నిర్మూలన సంస్కరణ నిజానిజాలను

వివేచించగల వాస్తవ జ్ఞానం ఉండే భావకురాలు. జీవిత సంస్కరణనించి కాక కేవలం పుస్తక జ్ఞానం నుంచీ, సిద్ధాంతాలనుంచీ, ఉద్వేగం పొందే బలహీన ఉద్ధరింపుల సంస్కర్తను తల దించుకునేట్లు చేసిన యువతి సరళ. కానీ, సమాజం సులభంగా తనలోకి తీసుకోని కులవృత్తి బాధితురాలు.

దిద్దుబాటులో, మెటిల్డాలో దాంపత్య జీవనం చిత్రితమైంది. సంస్కర్త హృదయంలో వివాహ బంధాలకు వెలిగా ఉంటున్న ఒక యువతి చిత్రితమైంది. దాంపత్య జీవనంలోని విషమ ఘట్టాలనూ, దాంపత్య జీవనం ఒక మృషగా ఉండే ఒకానొక కులం బాధలనూ ఈ కథల ద్వారా మనం గ్రహించవచ్చు. అయితే దిద్దుబాటుకూ, సంస్కర్త హృదయం కథకూ ఒక లంకె ఉంది. ఆ లంకె, సమాజంలో అసమ పరిస్థితుల మూలంగా ఏర్పడింది. దిద్దుబాటు కథలో సంఘ సంస్కరణోత్సాహి అయిన భర్త వేశ్యాకర్షణలో పడిన గోపాలరావు. సంస్కర్త హృదయంలో వేశ్యాకన్య వేశ్యా సమస్యకు పరిష్కారం ఇప్పుడున్న పరిస్థితుల్లో లభిస్తుందా? అని ప్రశ్నించిన ధీరురాలు.

ఈ మూడు కథల్లోని స్త్రీపాత్రలకు కనిపించే పురుష పాత్రలు - దిద్దుబాటులోని గోపాలరావు. మంచి చెడ్డలను గురించి ఆలోచించగలిగి ఘర్షణ పడగల హృదయమున మనిషి. మెటిల్డాలోని ముసలి భర్తకు సంస్కారం, ఇల్లాలు సౌశీల్యాన్ని గుర్తించాక మారినా ఆ మార్పు కలికాలం నిలిచేదని రచయిత ఎక్కడా సూచించలేదు. సంస్కర్త హృదయంలోని రంగనాధయ్యర్ లోకజ్ఞాన రహితుడు. సౌందర్య పిపాసి. మోహతత్పరుడు. వేశ్యా సమస్యను మానవదృష్టితో చూడలేని అపరిపక్వ బుద్ధజీవి. ఈ ముగ్గురిలో గోపాలరావుది భార్యపట్ల గౌరవంతో, ప్రేమతో కూడిన సర్దుబాటు. అది ఆపేక్షలో భాగం. విద్య నేర్చిన స్త్రీ రత్నం అతనికి దొరకడం వల్లా, ఆమె దిద్దుబాటును అంగీకరించగల మనసు ఉండడం వల్లా, ఆమె దిద్దుబాటు అనుకోలేము. అది ఒక విధంగా కన్నీటి గాధ. సంస్కర్త హృదయంలోని రంగనాధయ్యర్ సరళ చేతిలో పరాభవం పొంది ఉండవచ్చు. కానీ, ఆ అమ్మాయి ప్రొఫెసరు రంగనాధయ్యర్‌కు వేసిన రెండు ప్రశ్నలు సమాజాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. "నా బోటి భోగం పిల్లను ఏం మర్యాదస్తుడు పెళ్ళాడతాడో చెప్పండి మీరే? ఎవరో ఒక ఛండాలుడికి నేను కలకాలం పూర్తిగా బానిసనై పడిఉండాలనా మీ తాత్పర్యం?" సంస్కర్తలు కుదిర్చే పెళ్ళిళ్ళ మీద విసిరిన సవాళ్ళు ఇవి. కథాంశాలకూ, కథా సంవిధానాలకూ, రచయిత ప్రాపంచిక దృష్టికీ, కీలకమైన మానవ చర్యల చిత్రణను ఈ కథల్లో మనం చూడవచ్చు.

మత సమస్యల మీద గురజాడ రాసిన రెండు కథలు. మీ పేరేమిటి?, పెద్ద మసీదు. మీ పేరేమిటి కథలో శైవ వైష్ణవ మతశాఖల మధ్య ఉండే స్వార్ధ నిష్ఠ ప్రయోజనాలూ, వైషమ్యాలూ చిత్రితమయాయి. పెద్ద మసీదులో మతం మతాతీకరణ మూలాలు చిత్రితమయాయి.

మీ పేరేమిటి? కథ పెద్ద కథ. ఆ కథ పేరు దేవుడు చేసిన మనుషుల్లారా మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటి? ఈ కథకు కేంద్రం విశాఖ జిల్లాలోని రామతీర్థాలు. ఒకప్పటి బౌద్ధ క్షేత్రం, కథాకాలానికి శైవ, వైష్ణవ మతాల రంగస్థలమైంది. మోతుబరుల సాయం ఉంటేనే ఈ మతాల ప్రచారం, మత శాఖల మధ్య శాఖాంతరీకరణం, ఈ కథలో స్వామివారి తిరునామమే పేరు అని చెప్పి, పేరూ సాయెబుతో గుండం తొక్కించిన నాంచారమ్మ, శివుని త్రిశూలం, వైష్ణవ తిరునామం, పేరు ఒకటేనని బోధించడం మనలను అంతస్సంఘర్షణకు గురిచేస్తుంది. ఆలోచింప చేస్తుంది. గురజాడ అన్నట్లు 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అనే దిశగా ఒక తాత్విక సంవేదనకు గురి చేస్తుంది.

పెద్ద మసీదు అయిదువందల మాటలలోపు చిన్న కథ. కాశీ నుండి శిష్యుడితో కలిసి స్వగ్రామం వచ్చిన నారాయణ భట్టు గుడిస్థానంలో కట్టిన మసీదును చూసి నివ్వెరపోతారు. అంతకంటే నివ్వెరపోయింది, మసీదులోని ముస్లిం తన మేనమామ అని తెలిసినప్పుడు. మేనమామ విలాపం, మతమార్పిడి వెనుక ఉండే కథలో చెప్పని కారణాల గురించి ఆలోచింప జేస్తుంది. ఈ రెండు కథలూ గురజాడ కథన నైపుణ్యానికి దృష్టాంతంగా నిలుస్తాయి.

ప్రముఖ సాహిత్య విమర్శకుడు వల్లంపాటి వెంకట సుబ్బయ్య అన్నట్లు " మీ పేరేమిటి? కథనంలోని కథనాన్ని ఇముడ్చుకున్న పొరల పొట్లం వంటి కథ. ఇందులో ప్రధాన కథకుడు శాస్త్రిగారు. వారి సందేహాన్ని తీర్చడానికి ప్రస్తుత కథను శాయన్న భుక్త చెపుతాడు. మళ్ళీ కథ శాస్త్రిగారి వద్దకొచ్చి వారిలో కలిగిన మత సహన సూచనతో ముగుస్తుంది. ఇలా ఈ కథలో అద్యంతాల సమన్వయం చక్కగా కుదిరింది."

పెద్ద మసీదు నార్లవారి ప్రకారం "సంపూర్ణమైన కథ. దానికి మరొక వ్యాక్యాన్ని కలిపితే, మరొక మాట కలిపినా కూడా నాటకీయమైన దాని పతాక సన్నివేశ బలం అంతా దెబ్బతింటుంది." గురజాడ 500 పదాల లోపు పెద్ద మసీదు కథను రాసినా, అయిదు వేల పదాలలోపు సంస్కర్త హృదయం, మీ పేరేమిటి రాసినా, కథా నిర్మాణ శ్రద్ధతో రాశారు. తన కాలంలోని ప్రధాన సమస్యల మీద, చార్రితక సమస్యల మీదా దృష్టిని కేంద్రీకరించారు. ఒకవైపు సంస్కరణనూ, వాస్తవికతనూ, మరొకవైపు విమర్శనా వాస్తవికతనూ కథలో చిత్రించి, అధ్వాన్నంగా బతికిన వాళ్ళను నిరసించారు. ఆయన దృష్టిలో జీవితం ఒక నిరంతరమైన దిద్దుబాటు. జీవిత విమర్శ ద్వారా మాత్రమే సాధ్యమయ్యే దిద్దుబాట.

నాటక రచనలలోనూ, కవిత్వంలోనూ, కథారచనలోనూ వాస్తవికతా వాదధోరణులను గురజాడ ప్రవేశపెట్టారు. కవిత్వంలో గురజాడ అనంతరం అంతర్ముఖ నిష్టమైన కాల్పనికోద్వేగాలతో, భావకవిత్వం రెండు మూడు దశాబ్దాలు రాజ్యమేలింది. అయినప్పటికీ గురజాడ కథా మార్గాన్నీ, ఆయన సామాజిక సంవేదననూ తర్వాతి తరాల కథా రచయితలు అనుసరించారు. తెలుగు కథకు అడుగుజాడ గురజాడది. అది భావికి బాట.

